## తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి అవార్డు




హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఫుట్‌బాల్ క్రీడను ప్రోత్సహించడంలో విశేష కృషి, సహకారం అందిస్తున్నందుకు గాను తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీకి ప్రతిష్ఠాత్మక 'ఫుట్‌బాల్ ప్రోత్సాహక అవార్డు' దక్కింది. అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) వార్షిక అవార్డుల దినోత్సవంలో భాగంగా భువనేశ్వర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సోనిబాలా దేవీ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇది తెలంగాణ ఫుట్‌బాల్‌కు దక్కిన గౌరవమని, రాష్ట్రంలో క్రీడా సంస్కృతిని పెంపొందించడానికి ఇది ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

## సాబ్లేకు 8వ స్థానం



షాంఘై (చైనా): భారత యువ అథ్లెట్ అవినాశ్ సాబ్లె షాంఘై డైమండ్ లీగ్‌లో 8వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. శనివారం కెకియావో వేదికగా జరిగిన పురుషుల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్ ఈవెంట్‌లో సాబ్లె.. 8 నిమిషాల 23.85 సెకన్లలో లక్ష్యాన్ని పూర్తిచేశాడు. 16 మంది పాల్గొన్న ఈ పోటీలో సిమె అబ్రహమ్ (ఇథియోపియా) 8 నిమిషాల 07.92 సెకన్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా కెన్యా అథ్లెట్లు సెరెమ్, సిమోన్ వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు.

## భారత్‌కు నాలుగో ఓటమి



పెర్త్: ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న భారత మహిళల హాకీ జట్టు వైఫల్య ప్రదర్శన కొనసాగుతున్నది. పెర్త్ వేదికగా ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లోనూ భారత్.. 2-3తో పోరాడి ఓడింది. భారత్ తరఫున నవ్‌నీత్ కౌర్ (35వ నిమిషం), లల్రెమ్‌సియామి (59 ని.)లో గోల్స్ చేశారు. ఆస్ట్రేలియా నుంచి గ్రేస్ స్టీవార్ట్ (2 ని.) జేడ్ స్మిత్ (36 ని.), హెయిస్ (42 ని.)లో గోల్స్ కొట్టారు.

# భళా బెంగళూరు

**ఉత్కంఠపోరులో ఆఖరి బంతికి విజయం ● గెలుపు ముంగిట చెన్నై బోల్తా ● ఆయుష్ మాత్రె పోరాటం వృథా**



ఆయూష్ (94)

బెంగళూరు: వరుస పరాభవాలతో ఐపీఎల్-18లో అందరికంటే ముందు ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే).. మరోసారి గెలుపు ముంగిట బోల్తా కొట్టింది. చిన్నస్వామి వేదికగా చివరి బంతి వరకూ ఉత్కంఠగా సాగిన పోరులో ఆతిథ్య రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ).. చెన్నైని 2 పరుగుల తేడాతో ఓడించి మళ్లీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి దూసుకొచ్చింది. బెంగళూరు నిర్దేశించిన 214 పరుగుల ఛేదనలో సీఎస్‌కే.. 20 ఓవర్లలో 211/5 వద్దే ఆగిపోయింది. ఆయుష్ మాత్రె (48 బంతుల్లో 94, 9 ఫోర్లు, 5 సిక్సర్లు) వీరవిహారానికి తోడు రవీంద్ర జడేజా (45 బంతుల్లో 77 నాటౌట్, 8 ఫోర్లు, 2 సిక్సర్లు) పోరాడినా ఆఖర్లో తడబడ్డ చెన్నైకి ఓటమి తప్పలేదు. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ.. విరాట్ కోహ్లీ (33 బంతుల్లో 62, 5 ఫోర్లు, 5 సిక్సర్లు), జాకబ్ బెతెల్ (33 బంతుల్లో 55, 8 ఫోర్లు, 2 సిక్సులు), రొమారియో షెపర్డ్ (14 బంతుల్లో 53 నాటౌట్, 4 ఫోర్లు, 6 సిక్సులు) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 213/5 చేసింది.

### సంక్షిప్త స్కోర్లు

**బెంగళూరు:** 20 ఓవర్లలో 213/5 (కోహ్లీ 62, బెతెల్ 55, పతిరాన 3/36, నూర్ 1/26); **చెన్నై:** 20 ఓవర్లలో 211/5 (ఆయూష్ 94, జడేజా 77*, ఎంగిడి 3/30, కృనాల్ 1/24)

### ఓపెనర్ల దూకుడు.. రూథర్‌ఫర్డ్ విధ్వంసం..

ఓపెనర్లు కోహ్లీ, బెతెల్ బెంగళూరు ఇన్నింగ్స్‌ను దూకుడుగా ఆరంభిస్తే ఆఖర్లో షెఫర్డ్ ఖతర్నాక్ ఫినిషింగ్ ఇచ్చాడు. నిఖార్సైన పేసర్ లేని చెన్నై బౌలింగ్‌పై బెంగళూరు ఓపెనింగ్ జోడీ ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగడంతో స్కోరు వేగం రాకెట్ వేగాన్ని తలపించింది. బెతెల్, కోహ్లీ బౌండరీలు, సిక్సర్లతో దండెత్తడంతో పవర్ ప్లేలోనే ఆ జట్టు స్కోరు వికెట్ నష్టపోకుండా 71 పరుగులకు చేరింది. 27 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద బెతెల్ ఇచ్చిన క్యాచ్‌ను సీఎస్‌కే జారవిడవడంతో బతికిపోయిన అతడు.. ఆ తర్వాత వీరబాదుడు బాదాడు. 28 బంతుల్లో ఈ కుర్రాడి అర్ధ శతకం పూర్తయింది. పదో ఓవర్లో బంతినందుకున్న పతిరాన.. బెతెల్‌ను ఔట్ చేసి ఎట్టకేలకు ఈ జోడీని విడదీశాడు. 9.5 ఓవర్లలోనే ఈ ద్వయం 97 పరుగులను జోడించడం విశేషం. జడేజా బౌలింగ్‌లో బౌండరీతో కోహ్లీ కూడా ఈ సీజన్‌లో ఏడో హాఫ్ సెంచరీని నమోదుచేశాడు. కానీ సామ్ కరన్ ఓవర్లో కోహ్లీ ఔట్ అవడం.. అదే సమయంలో చెన్నై బౌలర్లు కట్టడి చేయడంతో బెంగళూరు స్కోరుబోర్డు వేగం తగ్గింది. మిడిలార్డర్‌లో పడిక్కల్ (17), రజత్ (11), జితేశ్ (7) వేగంగా ఆడలేకపోయారు. 18వ ఓవర్లో పటీదార్ నిష్క్రమించే సమయానికి బెంగళూరు స్కోరు 159/5 మాత్రమే. ఆర్‌సీబీ 170-180 చేస్తే గొప్ప అనుకున్నారంతా. కానీ కండల్లో కరెంట్ నింపుకుని వచ్చాడో ఏమో గానీ క్రీజులోకి వచ్చిన షెపర్డ్.. ఖలీల్ వేసిన 19వ ఓవర్లో 6, 6, 4, 6, 6 (నోబాల్), 4తో ఏకంగా 33 పరుగులు పిండుకున్నాడు. పతిరాన ఆఖరి ఓవర్లోనూ అతడు..4, 4, 6, 6 తో 14 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తిచేశాడు.

### ఆయుష్ పోరాడినా..

లక్ష్యం చూస్తేనేమో కొండంత ఉంది. ఏడేండ్ల కాలంలో 185+ టార్గెట్‌ను ఛేదించే క్రమంలో చెన్నై విజయవంతమైన దాఖలాల్లేవు. దీంతో ఈ మ్యాచ్ కూడా కష్టమే? అనుకున్నారంతా. పవర్ ప్లేలోనే ఓపెనర్ రషీద్ (14)తో పాటు కరన్ (5) కూడా ఔట్ అవడంతో బెంగళూరు గెలుపు సంబురాలు చేసుకుంది. కానీ ఆయుష్ మాత్రం చెన్నైలో గెలుపు ఆశలు రేపాడు. బౌండరీతో పరుగుల వేటకు శ్రీకారం చుట్టిన 17 ఏండ్ల ఈ కుర్రాడు.. భువనేశ్వర్ వేసిన 4వ ఓవర్లో 4, 4, 4, 6, 4, 4తో 26 రన్స్ రాబట్టాడు. జడేజా అండగా అతడు చెన్నై స్కోరుబోర్డును పరుగులు పెట్టిస్తూ లక్ష్యాన్ని వడివడిగా కరిగించాడు. సుయాశ్ బౌలింగ్‌లో మిడ్‌వికెట్ దిశగా సింగిల్ తీసిన ఆయుష్.. ఈ లీగ్‌లో తొలి అర్ధశతకాన్ని నమోదుచేశాడు. షెపర్డ్ పదో ఓవర్లో రెండు సిక్సర్లు, బౌండరీ దంచడంతో చెన్నై వంద పరుగుల మార్కును దాటింది. జడ్డూ కూడా బౌండరీలతో కదం తొక్కి 29 బంతుల్లో హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. ఆయుష్ 94 రన్స్ వద్ద ఎంగిడి బౌలింగ్‌లో కృనాల్‌కు క్యాచ్ ఇచ్చి సెంచరీని జారవిడుచుకున్నాడు. మరుసటి బంతికే బ్రెవిస్ కూడా ఎల్బీగా వెనుదిరగడంతో చెన్నై అభిమానుల్లో టెన్షన్ మొదలైంది. ఆఖరి ఓవర్లో ఆ జట్టు విజయానికి 15 పరుగులు అవసరమనగా.. దయాల్ అద్భుతంగా బౌలింగ్ చేసి 12 పరుగులే ఇవ్వడంతో సీఎస్‌కే ఓటమివైపు నిలిచింది.



కోహ్లీ (62)

## నిశికకు మూడు పతకాలు

**నేషనల్ చాంపియన్‌షిప్స్‌లో సత్తాచాటిన హైదరాబాదీ**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాదీ యువ జిమ్నాస్ట్ నిషిక అగర్వాల్ పూణెలో జరిగిన నేషనల్ చాంపియన్‌షిప్స్‌లో మూడు పతకాలతో సత్తా చాటింది. గత నెల 25 నుంచి మే 3 దాకా జరిగిన టోర్నీలో నిషిక.. మహిళల ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్‌లో రెండు స్వర్ణాలు, ఒక రజతం గెలుచుకుంది. 'వాల్టింగ్ టేబుల్' ఈవెంట్‌లో 12.883 స్కోరుతో స్వర్ణం సొంతం చేసుకున్న ఆమె 'బ్యాలెన్సింగ్ బీమ్'లో 10.967 స్కోరుతో రజతంతో మెరిసింది. 'ఫ్లోర్ ఎక్సర్‌సైజ్' ఈవెంట్‌లోనూ 11.43 స్కోరు సాధించిన నిషిక పసిడి సొంతం చేసుకుంది. అన్‌ఈవెన్ బార్స్‌లో నిషిక (9.20 స్కోరు).. కొద్దిపాటి తేడాతో కాంస్యం కోల్పోయింది. మహారాష్ట్ర క్రీడాకారిణి అనుష్క (9.43) మూడో స్థానంతో పతకం సాధించింది.





## డీబీఏ విజయం


హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఎల్ వెంకట్‌రామ్‌రెడ్డి (ఎల్‌వీఆర్) స్మారక బాస్కెట్ బాల్ టోర్నీలో డీబీఏ ఆంథోని జట్టు.. ఎస్‌ఎస్‌బీఏపై విజయం సాధించింది. చాదర్‌ఘాట్ విక్టరీ ప్లేగ్రౌండ్ వేదికగా జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా రెండో రోజు డీబీఏ.. 58-22తో ఘనవిజయం సాధించింది. మరో పోరులో సెయింట్స్ జీ9 జట్టు.. 44-18తో రెడ్డి హాస్టల్ టీమ్‌పై గెలిచింది.

# ఆసియా కప్‌పై అనిశ్చితి!

**పాక్‌ను ఆడనిస్తే భారత్ పాల్గొంటుందా?**

**టోర్నీ వాయిదాకే మొగ్గు**

ఢిల్లీ: అసలే అంతంతమాత్రంగా ఉన్న భారత్, పాక్ క్రికెట్ సంబంధాలు రాబోయే రోజుల్లో మరింతగా క్షీణించనున్నాయా? ఇరుదేశాల మధ్య ఏర్పడ్డ ఉద్రిక్తతలు, తాజా పరిణామాలు ఆ అనుమానాలను బలోపేతం చేస్తున్నాయి. దాయాదితో ఇప్పటికే ద్వైపాక్షిక సిరీస్‌లు ఆడటాన్ని నిషేధించిన భారత క్రికెట్ జట్టు.. ఐసీసీ ఈవెంట్లు, ఆసియా కప్ వంటి టోర్నీలలో మాత్రమే పాక్‌తో క్రికెట్ ఆడుతున్నది. కానీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌తో క్రికెట్‌కు పూర్తిగా స్వస్తి చెప్పేందుకు బీసీసీఐ సిద్ధమైనట్టు తెలుస్తున్నది. ఐసీసీ కూడా ఈ విషయంపై పునరాలోచించాలని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వ్యాఖ్యానించడం కొత్త చర్చకు దారితీసింది. ఇక ఈ ఏడాది భారత్, శ్రీలంకలో జరగాల్సి ఉన్న ఆసియా కప్‌లో ఈ రెండు జట్లు తలపడేది కష్టమేనని సమాచారం. టోర్నీలో పాకిస్థాన్ ఉండి ఆ జట్టుతో భారత్ మ్యాచ్‌లు ఆడకుండా ఆసియా కప్‌ను నిర్వహించడం అసాధ్యం. అయితే పాకిస్థాన్ లేకుండానే ఆసియా కప్‌ను నిర్వహించాలని, ఆ దేశాన్ని ఆసియా క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ) నుంచి బహిష్కరించాలని భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అభిప్రాయపడ్డారు. అలా జరగని పక్షంలో భారత్.. ఏసీసీ నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. తాజా పరిణామాలపై బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ..'ప్రస్తుతం భారత్-పాక్ సంబంధాలు సరిగ్గా లేవు. ఇలాంటి పరిస్థితుల్లో టోర్నీ (ఆసియా కప్) నిర్వహణ చాలా కష్టంతో కూడుకున్నది. ఆసియా కప్ వాయిదా పడే అవకాశాలున్నాయి' అని తెలిపారు.



### బంగ్లా పర్యటనా డౌటే!

ఆసియా కప్ కంటే ముందే ఆగస్టులో బంగ్లాదేశ్‌కు వెళ్లనున్న భారత జట్టు ఆ పర్యటననూ రద్దు చేసుకోనున్నట్టు వార్తలొస్తున్నాయి. బంగ్లాదేశ్‌కు చెందిన మేజర్ జనరల్ (రిటైర్డ్) ఫజ్లుర్ రెహ్మన్ ఫేస్‌బుక్‌లో స్పందిస్తూ.. 'ఒకవేళ భారత్.. పాకిస్థాన్‌పై దాడి చేస్తే మనం (బంగ్లాదేశ్) ఆ దేశంలోని ఈశాన్య రాష్ట్రాలను స్వాధీనం చేసుకోవాలి. చైనాతో కలిసి సంయుక్తంగా మిలిటరీ చర్య జరిపి వాటిని దక్కించుకోవాలి' అని పోస్ట్ పెట్టడం వివాదాస్పదమైంది.

### పాయింట్ల పట్టిక

| జ | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | ర.రే |
|---|---|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 8 | 3 | 0 | 16 | 0.48 |
| ముంబై | 11 | 7 | 4 | 0 | 14 | 1.27 |
| గుజరాత్ | 10 | 7 | 3 | 0 | 14 | 0.86 |
| పంజాబ్ | 10 | 6 | 3 | 1 | 13 | 0.19 |
| ఢిల్లీ | 10 | 6 | 4 | 0 | 12 | 0.36 |
| లక్నో | 10 | 5 | 5 | 0 | 10 | -0.03 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 1 | 9 | 0.27 |
| రాజస్థాన్ X | 11 | 3 | 8 | 0 | 6 | -0.78 |
| హైదరాబాద్ | 10 | 3 | 7 | 0 | 6 | -1.19 |
| చెన్నై X | 11 | 2 | 9 | 0 | 4 | -1.11 |


నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, ఫ.తే-ఫలితం తేలనిది పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

# రబాడాపై నిషేధం

**డ్రగ్స్ తీసుకున్నట్టు వెల్లడించిన సఫారీ పేసర్**



జోహన్నస్‌బర్గ్: ఐపీఎల్-18లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ ఈ టోర్నీ నుంచి అర్ధాంతరంగా వైదొలిగిన దక్షిణాఫ్రికా పేసర్ కగిసో రబాడా శనివారం సంచలన ప్రకటనతో క్రికెట్ అభిమానులను షాక్‌కు గురిచేశాడు. ఈ ఏడాది జనవరిలో జరిగిన ఎస్‌ఏ 20 (సౌతాఫ్రికా క్రికెట్ లీగ్)లో తాను నిషేధిత ఉత్ప్రేరకాన్ని వాడినందుకు గాను దక్షిణాఫ్రికా క్రికెట్ తనపై తాత్కాలిక నిషేధం విధించినట్టు వెల్లడించాడు. ఎస్‌ఏ 20లో రబాడా.. ఎంఐ కేప్‌టౌన్‌కు ఆడాడు. 'వ్యక్తిగత కారణాలతో నేను స్వదేశానికి వెళ్లానని ఇదివరకే తెలిపాను. అయితే ఎస్‌ఏ 20లో నిషేధిత డ్రగ్‌ను వాడినందుకు గాను దక్షిణాఫ్రికా క్రికెట్ అసోసియేషన్ (ఎస్‌ఏసీఏ) నాపై తాత్కాలిక నిషేధం విధించింది. క్రికెట్ ఆడే అవకాశాన్ని నేను ఎల్లప్పుడూ గౌరవంగా భావిస్తా. తిరిగి నాకు ఎంతో ఇష్టమైన క్రికెట్ ఆడేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా' అని అతడు ఓ ప్రకటనలో వెల్లడించాడు. ఇదిలాఉండగా రబాడా వాడిన డ్రగ్ ఏంటి? అతడిపై ఎన్నిరోజులు నిషేధం ఉండనుంది? అన్నదానిపై మాత్రం రబాడా గానీ దక్షిణాఫ్రికా క్రికెట్ గానీ స్పష్టతనివ్వలేదు. సఫారీ పేసర్ తాజా ప్రకటన నేపథ్యంలో అతడు ఐపీఎల్‌లో మిగిలిన మ్యాచ్‌లతో పాటు జూన్‌లో జరుగబోయే ప్రపంచ టెస్ట్ చాంపియన్‌షిప్ ఫైనల్ (ఆస్ట్రేలియా X దక్షిణాఫ్రికా)కూ దూరమవనున్నట్టు సమాచారం.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.